నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
11 | హైదరాబాద్, ఆదివారం 25 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

లక్ష్మీ నరసింహస్వామి వారికి చక్రతీర్థ స్నానం చేయిస్తున్న అర్చకులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

- మంత్రపూర్వక స్నానమాచరించిన లక్ష్మీనరసింహుడు
- ఘనంగా మహాపూర్ణాహుతి.. శ్రీపుష్పయాగం
- నేత్రపర్వంగా పాతగుట్ట బ్రహ్మోత్సవాలు

లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్ణో యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప బ్రహ్మణ్య కేశవ జనార్ధన వాసుదేవ లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : పాతగుట్ట లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా చక్రతీర్థస్నానం జరిపించారు. కల్యాణం, రథోత్సవంతో అలసిన స్వామివారికి చక్రతీర్థ సేవ నిర్వహించి శృంగార డోలోత్సవానికి సిద్ధం చేశారు. నిత్యారాధనల అనంతరం పారాయణికులచే చతుర్వేద పారాయణాలు, యాజ్ఞికులచే నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు జరిపారు. అనంతరం మహాపూర్ణాహుతి మహోత్సవాన్ని పాంచరాత్రగమశాస్త్రరీతిలో అత్యంత వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం చక్రతీర్థ మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యాజ్ఞాచార్యులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు తమ మనస్సు, తనువును ఒక్కటిచేసి శ్రీ నారసింహ.. జయ నారసింహ అంటూ జయజయ ధ్వానాలు చేస్తూ లక్ష్మీనరసింహస్వామి వారి శ్రీచక్రాళ్వార్‌కు జరిపించిన చక్రతీర్థ మహోత్సవాన్ని తిలకించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామి శ్రీచక్రాళ్వార్‌తో కలిసి మంత్రపూర్వక స్నానం గావించారు. స్థానిక భజన మండలి సభ్యులు భజన నిర్వహించారు. ఆలయంలో వేద పారాయణాలు జరిపారు.

శ్రీపుష్పయాగం.. డోలారోహణం

పాతగుట్టలో సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం, డోలారోహణం, దేవతా ఉద్వాసన వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహుడి ఉత్సవాలకు ఆహ్వానించిన దేవతలను మంత్రముల చేత ఆహ్వానించిన పిదప తిరిగి వారి స్వస్థలాలకు సంప్రదాయంగా పంపించే దేవతా ఉద్వాసన వేడుక అత్యంత వైభవంగా సాగింది. భగవానుడి నామాలతో అర్చన వేడుకలు నిర్వహించే ప్రక్రియను శ్రీపుష్పయాగం పాంచరాత్రగమశాస్త్రరీతిలో చేపట్టారు. సహస్ర నామాలతో అమ్మవారిని, భగవానుడిని పుష్పాలతో ఆరాధించారు. కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు కిరణ్‌కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థిఘళ్ సీతామనోహరాచార్యులు, పారాయణందారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీకాంత్, విజయకుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకరణలో స్వామివారు

నేడు అష్టోత్తర శతఘటాభిషేకం

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మహదాశీర్వచనం, పండిత సన్మానం నిర్వహించి బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న విద్యార్థులు 12,559 మంది

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 16 వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 12,559 మంది పరీక్షలకు హాజరు కానుండా, వారి కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు సమయానికి ముందే కేంద్రానికి రావాలని అధికారులు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 9గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షల నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, 30 కేంద్రాలకు గాను 30 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పట్టభద్రుల ఓటర్లు 4,27,289

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మార్చి14 వరకు అభ్యంతరాల స్వీకరణ

నల్లగొండ, ఫిబ్రవరి 24 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటరు జాబితాను నల్లగొండ కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన శనివారం ప్రచురించారు. నియోజకవర్గవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఇప్పటి వరకు 4,27,289 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగా, అందులో 2,66,622 మంది పురుషులు, 1,60,661మంది మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు ఉన్నారు. జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీకి రాజీనామా చేయగా తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు గానూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఈ నెల 6 వరకు గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటివరకు 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటే మార్చి14 వరకు తెలియజేయాలని కలెక్టర్ హరిచందన సూచించారు. శనివారం విడుదల విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాలతోపాటు ఆర్డీఓ, తాసీల్దార్ కార్యాలయాలు, నియోజకవర్గంలో గుర్తించిన 600 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను మార్చి 14 వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్లు
సిద్దిపేట	5	4,412
జనగాం	27	21,870
హనుమకొండ	67	39,167
వరంగల్	59	40,250
మహబూబాబాద్	36	32, 622
ములుగు	17	9,532
భూపాలపల్లి	16	11,814
భద్రాద్రి కొత్తగూడెం	55	36,926
ఖమ్మం	115	76,869
యాదాద్రి భువనగిరి	37	31,778
సూర్యాపేట	71	47,465
నల్లగొండ	95	74,584
మొత్తం	600	4,27, 289

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మార్చి 14వరకు అవకాశం
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 24 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులంతా మార్చి 14 వరకు ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ముసాయిదా ఓటర్ల జాబితా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారని, చేర్పులు, తొలగింపులకు వచ్చే నెల 14వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. మార్చి 29న దరఖాస్తులను పరిష్కరించి ఏప్రిల్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఈ నెల 6వరకు 36,246 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 31,778 దరఖాస్తులను ఆమోదించినట్టు, 4,468 అప్లికేషన్లు తిరస్కరించబడినట్టు చెప్పారు. 19,524 మంది పురుషులు, 12,254 మంది మహిళలు.. మొత్తంగా 31,778 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో భువనగిరి డివిజన్‌లో 22 పోలింగ్ కేంద్రాలు, చౌటుప్పల్ డివిజన్‌లో 15 కలిపి మొత్తంగా 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 14 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులు, నాయకులకు సూచించారు. ఓటరు నమోదు, తొలగింపుల కోసం తాసీల్దార్ కార్యాలయాల్లో గానీ, http://ceotserms2. telangana.gov. in/mlc/form18.aspxలో నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు నమోదుకు 2023 నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు అయి ఉండాలని, ఎపిక్ కార్డు వెంట ఆధార్, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ జత చేయాలని సూచించారు. ఎపిక్ కార్డు ఏ నియోజకవర్గానికి సంబంధించి ఉంటే అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, డిజిగ్నేటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, ఉడుత భాస్కర్, రత్నాపురం బలరాం, రవీందర్‌రెడ్డి, అనూరాధ, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసీల్దార్ సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పవర్ ప్లాంట్ ప్రగతిపై మంత్రుల సమీక్ష

- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం బట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్
- క్షేత్రస్థాయిలో సైట్ విజిట్
- టీఎస్‌జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్ష

దామరచర్ల, ఫిబ్రవరి 24 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్‌ను శనివారం సందర్శించారు. హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరిన మంత్రులు యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో ఉదయం 10:32 గంటలకు ల్యాండ్ అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌తోపాటు అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు కాన్వాయ్‌లో సైట్ విజిట్ చేశారు. 10:52 గంటలకు మీటింగ్ హాల్‌కు చేరుకోగా జెన్‌కో భద్రతా సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జెన్‌కో అధికారులతో 10:55 నుంచి 12:16 గంటల వరకు మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాంట్ ప్రగతి, పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలుపలికి రాగానే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్‌కు చెందిన 270 మంది ఓఅండ్‌ఎం కార్మికులు వారిని కలిసి ఇక్కడ తమకు సరైన వసతులు, పనులు లేవని, తిరిగి తమను పాల్వంచకు బదిలీ చేయాలని వినతి పత్రం అందజేశారు. వారితోపాటు పవర్‌ప్లాంటులో భూములు కోల్పోయిన కొంత మంది నష్టపరిహారం అందలేదని, భూనిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రైల్వేలైన్ కింద భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం 12:25 గంటలకు మంత్రులు హెలికాప్టర్‌లో మేళ్లచెర్వుకు బయల్దేరారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ రిజ్వీ, జిల్లా కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, డైరెక్టర్ అజయ్, ప్లాంటు సీఈ సమ్మయ్య, ఆర్డీఓ చెన్నయ్య, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ప్లాంట్ వద్దకు చేరుకున్న స్థానిక నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో వారు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

సూర్యాపేటలో మాట్లాడుతున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ ఆరాధే

కేసుల సత్వర పరిష్కారానికే అదనపు కోర్టులు

- కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలి
- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే
- కోదాడ, సూర్యాపేటలో అదనపు కోర్టులు ప్రారంభం

కోదాడ/సూర్యాపేట లీగల్, ఫిబ్రవరి 24 : కేసుల సత్వర పరిష్కారానికే అదనపు కోర్టులు మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే తెలిపారు. సామాన్యులకు సత్వర న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. శనివారం కోదాడ కోర్టులో సబ్ కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఆయన ప్రారంభించారు. కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సూర్యాపేటలో రెండో అదనపు ప్రథమశ్రేణి న్యాయస్థానానికి శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ వివాహ సంబంధాల వివాదాలతో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించిన మహిళలను పదే పదే తిప్పకుండా సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. న్యాయవాదులు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని న్యాయ వ్యవస్థకు వన్నె తేవాలని సూచించారు. అన్ని కోర్టుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. హైకోర్టు జడ్జిలు వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయసేనారెడ్డి, పుల్లా, కార్తీక్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు సీనియర్ న్యాయవాదులు వృత్తి నైపుణ్య విలువలను అందించాలన్నారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తిని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున సన్మానించారు. సూర్యాపేటకు చేరుకున్న హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్ స్వాగతం పలికారు. పోలీసులు న్యాయమూర్తులకు గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లా నాగేశ్వర్ రావు, కొల్లి సత్యనారాయణ, కోదాడ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి సాధు శరత్‌బాబు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు సమాజ విజ్ఞాన కేంద్రాలు

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

బొమ్మలరామారం, ఫిబ్రవరి 24 : ప్రభుత్వ పాఠశాలలు సమాజ విజ్ఞాన కేంద్రాలుగా పని చేస్తున్నాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని జీహెచ్‌ఎం నిర్మలజ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు, సమాజంలో జీవించే నైపుణ్యం నేర్చుకోవడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రచార మాయలో పడి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత, అందిస్తున్న ప్రయోజనాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. పాఠశాల వనరుల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, మాజీ సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుర్మిండ్ల ఈశ్వర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మోకు మధుసూదన్‌రెడ్డి, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24 : జిల్లాలో ఉన్న అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. పట్టణంలో శనివారం పోలీస్ అధికారులు, న్యాయవాదులతో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంతోపాటు మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, వారెంట్లపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు దాదాపు 4వేలను గుర్తించినట్లు తెలిపారు. సదరు కేసుల కక్షిదారులకు పోలీస్ శాఖ లోక్ అదాలత్ నోటీసులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక మొత్తంలో కేసులను పరిష్కరించేందుకు జిల్లాలో ఆయా కోర్టుల్లో ముందస్తుగా ప్రీ సిట్టింగ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.దశరథ రామయ్య, డీసీపీ ఎం.రాజేశ్‌చంద్ర, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ పూర్ణచందర్ పాల్గొన్నారు.



చిన్న మేడారంలో సమ్మక్కను వన ప్రవేశానికి తీసుకుపోతున్న పూజారులు

తల్లుల వన ప్రవేశం

- చిన్నమేడారం జాతరకు పోటెత్తిన భక్తజనం

రాజాపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని చిన్నమేడారంలో నాలుగు రోజులపాటు ఘనంగా సాగిన సమ్మక్క, సారలమ్మ జాతర సంపూర్ణమైంది. శనివారం జాతర నిర్వాహకులు అమ్మలకు సాంప్రదాయ పూజలు నిర్వహించి డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య వన ప్రవేశం చేయించారు. సారలమ్మను కుర్రారం గ్రామ శివారులోని ఎదులగుట్టపైకి, సమ్మక్కను బూర్గుపల్లి గ్రామ శివారులోని పులిగుట్టపైకి పంపించారు. వన దేవతలు వెళ్తున్న వేళ చల్లంగ దీవించి పోయిరండి తల్లులారా.. అంటూ భక్తజనం చేతులెత్తి మొక్కుకున్నారు. నాలుగు రోజుల పాటు పెద్ద మేడారం తరహాలో చిన్న మేడారంలో తల్లులకు పూజలు, జాతర నిర్వహించింగా భక్తులు పెద్ద ఎత్తున వన దేవతలను దర్శించుకొని నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ, గాజులు, బోనాలు, ఒడిబియ్యం సమర్పించుకున్నారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణ రద్దు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాతగుట్ట ఆలయంతోపాటు శివాలయంలో విధులు నిర్వహించే ఆరుగురు అర్చక, ఉద్యోగుల క్రమబద్ధీకరణను రద్దు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసిందని ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ తెలిపారు. పాతగుట్ట ఆలయంలో విధులు నిర్వహించే సత్యనారాయణచార్యులు, భరత్‌కుమారాచార్యులు, మురళీధర్ శర్మ, శివాలయంలో టి.నర్సింహమూర్తి, పి.నరసింహమూర్తితోపాటు సన్నాయి వాయిద్యకారుడు మస్తాన్‌ను 121 జీఓ కింద 2018లో క్రమబద్ధీకరించారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో 121 జీఓ వర్తించనందున వారి క్రమబద్ధీకరణ చెల్లుబాటు కాదని పేర్కొన్నట్లు డీఈఓ వెల్లడించారు. వారిలో సన్నాయి వాయిద్యకారుడు మస్తాన్ మృతిచెందగా మిగతా ఐదుగురి పోస్టుల క్రమబద్ధీకరణ నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. మస్తాన్ కుటుంబ సభ్యులకు అందుతున్న అలవెన్స్‌లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఐదుగురు అర్చకులు పూర్వ కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగనున్నారు. ఇప్పటి వరకు వారు తీసుకున్న వేతనం రికవరీ చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

చందంపేట పోలీసులపై దాడి

కేసు విచారణకు వెళ్లిన ఎస్ఐ, కానిస్టేబుళ్లకు గాయాలు

కడప జిల్లాలో ఘటన

చందంపేట, ఫిబ్రవరి 24 : కేసు విచారణలో భాగంగా ఏపీలోని కడప జిల్లాకు వెళ్లిన చందంపేట ఎస్ఐ, కానిస్టేబుళ్లపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందంపేట మండలం కంబాలపల్లికి చెందిన టేకులపల్లి అంజయ్య, నేలపట్ల ఆంజనేయులు, మామిళ్ల సైదులు, పిల్లి అంజయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, మరో ఇద్దరు కలిసి కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యవారిపల్లికి చెందిన ఓబుగాని సాంబయ్య, అతని కుమారుడు ఓబుగాని శివకు విడుతల వారీగా డబ్బు చెల్లించే ఒప్పందం మేరకు రూ.54.50లక్షల విలువైన గొర్రెలను గతేడాది డిసెంబర్‌లో కొనుగోలు చేశారు. ఒప్పందం మేరకు డబ్బు చెల్లించే విషయంలో సాంబయ్య కాలయాపన చేస్తుండడంతో విక్రయదారులు చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అప్పటి ఎస్ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. ఆయన బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన సతీశ్ కేసు విచారణ కోసం ఈ నెల 22న ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు గొర్రెల వ్యాపారులతో కలిసి ఓ ప్రైవేటు వాహనంలో చిన్నయ్యగారిపల్లికి వెళ్లారు. కేసు విషయమై ఓబుగాని సాంబయ్యతో మాట్లాడుతుండగా, పలువురు గ్రామస్తులు జోక్యం చేసుకొని పోలీసులపై దాడికి పాల్పడ్డారు. దాంతో ఎస్ఐతోపాటు కానిస్టేబుళ్లు, గొర్రెల విక్రయదారులకు గాయాలయ్యాయి. వాహనం ధ్వంసమైంది. ఈ మేరకు మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం.